# వేదములను ఆదరించండి

**వేదశాస్త్రంబులు వివరించి బుధులచే**
**చదివించవచ్చు తా చదువవచ్చు**
**యజ్ఞయాగతపములధికార జనులచే**
**చేయించవచ్చు తా చేయవచ్చు**
**ఇలలోనగల తీర్థముల కేగ నన్యుల**
**బోధింపవచ్చు తా బోవవచ్చు**
**అష్టాంగసిద్ధుల నార్యుల కుపదే**
**శింపంగ వచ్చుతా చేయవచ్చు**
**కాని దేహేంద్రియములరికట్టి నిలిపి**
**మనసునంతర్ముఖము చేసి యనవతరము**
**నిశ్చల సమాధి చిత్తులై నిలువలేరు**
**ఇంతకన్నను దౌర్భాగ్యమేమికలదు.**

**ప్రేమ స్వరూపులారా!**

వేదములనగా మంత్ర ద్రష్టలైన మహర్షులయొక్క సత్యవాక్య సముదాయమే. పరమాత్మయొక్క ఉచ్ఛ్వాస నిశ్వాసములే వేదములు. త్రిలోకములందు, త్రికాలములందు, తిరుగులేని సత్యమును ప్రబోధించునదే వేదము. త్రిలోక వాసుల యోగక్షేమము పురస్కరించుకొని శాంతిసౌఖ్యములు నందింపచేయునదే వేదము.

వేదము విద్ అనే ధాతువునుండి పుట్టినది. ఇదే జ్ఞాన స్వరూపము. ఇష్టసిద్ధిని గావించుకొనుటకుగాని, అయిష్టములను దూరము గావించుకొనుటకుగాని తగిన

srisathyasaivachanamrutam

ఉపాయములను ప్రబోధించునది వేదము. అనంతోవై వేదః అని అఖండమైన, అనంతమైన ఈ వేదమును మానవులభ్యసించటం కష్టంగా ఉండేది. పూర్వము వేదము ఒక్కటి మాత్రమే ఉండేది. దీనిని అధ్యయనము చేయటానికి అనంతకాలము పట్టేది. అధ్యయనమునకే కాలమునంతా వ్యర్థముగావించి ఆచరణ విచారణలందు దీనిని అనుభవించుటకు అసాధ్యమయ్యే పరిస్థితి పురస్కరించుకొని వ్యాసులవారు దీనిని విభజిస్తూ వచ్చారు.

ఈ అమోఘమైన వేదములందు కొన్ని ఋక్కులను మాత్రమే తీసి దీనిని ఋగ్వేదమని, యజస్సులను మాత్రమే తీసి దీనిని యజుర్వేదమని, సామములను మాత్రమే తీసి దీనిని సామవేదమని మూడు విధములుగా విభజిస్తూ వచ్చారు. మంత్రములకు సంహితమని ఒక పేరు. కనుకనే వీటికన్నిటికి ఋగ్వేద సంహితము, యజుర్వేద సంహితము, సామవేద సంహితము అని పేర్లు పెట్టారు. ఇందులో ఋగ్వేదము దేవతాస్తుతి స్వరూపమైనది. ఈ స్తుతి స్వరూపమైన ఋగ్వేద మంత్రములను అనంతమైన దివ్యభావముచేత స్మరిస్తూ వచ్చారు ఆనాటి ఋషులు. ఇంక యజుర్వేదము మంత్ర స్వరూపమైనది. దేవతా స్వరూపమును పూజిస్తూ రావటము ఈ యజుర్వేదముయొక్క మంత్రములను యజ్ఞయాగాది క్రతువులయందుగాని దాన ధర్మాది సత్కర్మల యందుగాని ప్రవేశపెడుతూ వచ్చారు.

ఒక్కొక్క వేదమును మూడు భాగములుగా విభజిస్తూ వచ్చారు. బ్రాహ్మణములు, అరణ్యకములు, ఉపనిషత్తులు, ఈ మంత్ర సంహితమునందు పరిపూర్ణ మంత్రములు మాత్రమే ఉండేవి. ఈ యజుర్వేద సంహితయందు, ఈ బ్రాహ్మణమునందు ఎక్కువ కర్మకాండ మాత్రమే కాకుండా దీనికి ఆచరణమైన మంత్ర ఉపదేశ జ్ఞాన యజ్ఞములుకూడను అనుసరించే మార్గము అవలంబిస్తూ వచ్చింది. ఈ బ్రాహ్మణము మరి మూడు విధములైన పేర్లతో అభివృద్ధి గావించుకుంటూ వచ్చింది. తైత్తిరీయ బ్రాహ్మణమని, ఐత్తిరీయ బ్రాహ్మణమని, శతపథ బ్రాహ్మణమని ఇవన్నీ మంత్ర స్వరూపమైనవి. ఈ విధమైన మార్పులచేత దేశ కళ్యాణము, మానవోద్ధరణ, యోగక్షేమములకే విభజిస్తూ రావటము జరిగింది.

యజ్ఞయాగాది క్రతువుల వల్ల లోకక్షేమము ఏర్పడుతుంది. సకాల వర్షములు సంభవిస్తాయని, సుభిక్షముతో జీవిస్తారని దీని ప్రభావము. ఇవన్నీ కర్మకాండలతో కూడిన

sri sathyasai vachanamrutam

దానివలన యజ్ఞ యాగాది క్రతువులవల్ల వర్షము సంభవించటము, సస్యశ్యామలముగా అభివృద్ధి గావటం, పంటలు అభివృద్ధి గావటం తద్వారా మానవ జీవితమునకు, తిండి తీర్థాదులకు లోటు లేకుండా జీవనము గడపటము ఇత్యాది ఫలితములను అనుభవిస్తూ వచ్చారు.

అరణ్యకములు. గృహస్థాశ్రమము అనుభవించిన తరువాత ఏకాంతముగ అడవులకో సమీప వనములకో వెళ్లి భగవచ్చింతనము గావించుకుంటూ వారు స్మరించినటువంటి భావములను మంత్రములచేత అభివృద్ధి చేసుకుంటూ వచ్చారు. భావోద్రేకముతో ఆవిర్భవించిన ఈ భావములను మంత్రములుగా చేకూర్చుతూ దానినే నిరంతరము స్మరించుకుంటూ చింతించుకుంటూ రావటముచేత దీనికి అరణ్యకము అని పేరు వచ్చింది. అరణ్యకములన్నీ ఎక్కువ భాగము కర్మకాండతో కూడి ఉంటున్నవి. చివర మాత్రము బ్రహ్మకాండముగా రూపొందుతుంది. ఈ బ్రహ్మకాండనే యజ్ఞ యాగాదులకు ఉపయోగపడుతూ వచ్చింది.

యజ్ అనే ధాతువునుండి ఆవిర్భవించినది యజుర్వేదము. ఇది పరిపూర్ణముగా దేవతా స్వరూపమును చింతించటమే. స్మరించటమే. పూజించటమే ఈ యజుర్వేదమును రెండు విధములుగా విభజించారు. ఇవే కృష్ణ యజుర్వేదము శుక్లయజుర్వేదము. వీటికి రెండు సాంప్రదాయాలున్నాయి. బ్రహ్మ సాంప్రదాయ మొకటి ఆదిత్య సాంప్రదాయమొకటి. బ్రహ్మ సాంప్రదాయమే శుక్ల యజుర్వేదము. ఆదిత్య సాంప్రదాయమే కృష్ణయజుర్వేదము. కృష్ణ యజుర్వేదము దక్షిణ భారతదేశమందు, శుక్ల యజుర్వేదము ఉత్తర భారతదేశమందు అభివృద్ధి అవుతూ వచ్చినవి.

**వేదము - విశేషములు**

ఈ వేదము తొమ్మిది పేర్లతో పిలువబడుతూ వచ్చింది. శృతి, అనుస్వర, త్రయీ, ఆమ్నాయము, సమామ్నాయము, ఛందస్, స్వాధ్యాయ, గమ, ఆగమ అనునవి. కారణము లేకుండా ఈ పేర్లు అభివృద్ధికి రాలేదు. శృతి, గురువు చెప్పినట్లుగా శ్రద్ధతో విని ఆ శబ్దమును అదే రీతిగా ఉచ్చరించి, అధ్యయనము చేసి వేదమును అభివృద్ధి గావించటము. అనగా వినికిడి చేత దీనిని అధ్యయనము చేయటము. అధ్యయనము చేసిన దానిని మననము చేసి స్మరిస్తూ పోషించుకుంటూ పోవటము అనుస్వరమన్నారు. త్రయీ పూర్వము ఋగ్వేదము, యజుర్వేదము,

srisathyasaivachanamrutam

సామవేదము యీ మూడు వేదములు మాత్రమే అపౌరుషేయములని అనేవారు. యజుర్వేదము నుంచి తీసి వేరు చేసిన మంత్రములు అధర్వణ వేదము. కనుక ఈ మూడు వేదములకు త్రయీ అని పేరు వచ్చింది. అమ్నాయము, 'మ్నా' అనే ధాతువుకు నిరంతరము చింతించటము అభ్యాసము చేయటము అని అర్థము. అభ్యాసము వల్ల ఇది అభివృద్ధి అవుతుంది కనుక దీనికి అమ్నాయము, సమామ్నాయము అని పేర్లు వచ్చినవి. ఛందస్సు, కప్పిపుచ్చి వ్యాప్తి గావించటమనేది ఒక అర్థము. వేదమంత్రముల కన్నింటికిని ఛందస్సు అని పేరు. సామవేదము అంతయు ఛందస్సుతో నిండిఉంది. స్వాధ్యాయము. ముత్తాతలు, తాతలు, తండ్రుల ద్వారా సాంప్రదాయంగా వేదము అభివృద్ధి గావించటముచేత దీనికి స్వాధ్యాయమని పేరు వచ్చింది. కేవలము గ్రంథములతో పరిచయమయ్యేటువంటిది కాదు. గురు శిష్య పరంపర చేతనే అభివృద్ధి గావించబడినది. పరంపరంగా స్వాధ్యాయం గావించటంవల్ల వచ్చింది. కనుకనే స్వాధ్యాయమని పేరు వచ్చినది. గమ, ఆగమ, భగవంతుని ఉచ్ఛ్వాస నిశ్వాసముల నుంచి ఏర్పడినది కనుకనే గమ, ఆగమ అని పేర్లు వచ్చినవి. ఏతావాతా వేదములన్నియు భగవంతుని ఉచ్ఛ్వాస నిశ్వాస స్వరూపములే. మంత్ర ద్రష్టలైన మహర్షులు దీనిని అష్ట అక్షరములతో శ్రవణము చేసినారు. అకచటతపయశ అనే వాటిని ఎనిమిది కోట్ల అక్షరములుగా అభివృద్ధి గావించుతూ వచ్చినారు. మహర్షులు వీటిని అనేక విధములుగా పోషించుకుంటూ వచ్చినారు.

ఈ వేదములకు అనేక శాఖలు, ఉపశాఖలు ఉండేటువంటివి. ఋగ్వేదమునకు 20 ప్రధాన శాఖలు, 21 ఉపశాఖలు. కాని దురదృష్టవశాత్తు కాలగర్భములో కలసిపోయి ఇప్పుడు 3 శాఖలు మాత్రమే నిలిచాయి. యజుర్వేదములో 96శాఖలుండేవి. కానీ 2 శాఖలు మాత్రమే ఇప్పుడు నిలిచాయి. సామవేదము వేయి శాఖలతో ఉండేటువంటిది. అదికూడా ఇప్పుడు 3 శాఖలతో నిలిచి ఉంది. ఈనాడు మిగిలిన ఇంత తక్కువ శాఖలలోనే ఇంత అనంత జ్ఞానము ఇమిడి ఉండగా గతించిన శాఖలన్నీ ఉండిఉంటే భారతీయులు ఎంత ప్రజ్ఞావంతులై ఉండే వారో వేదములను అలక్ష్యము చేస్తూ రావటము చేతనే భారతీయుల ప్రజ్ఞాన విజ్ఞానములు కూడా క్షీణిస్తూ వచ్చాయి. సంకుచిత భావములు పెరుగుతూ వచ్చినాయి. విశాలమైన భావములు క్షీణిస్తూ వచ్చాయి. ఈనాడు వేదములంటే అయిష్ట పడేవాళ్లు అసహ్యపడేవాళ్లు విరివిగా పెరుగుతూ పోతున్నారు. అసలు ప్రధానమైన బ్రాహ్మణులయందు ఈ విధమైన భక్తిశ్రద్ధలు

sri sathyasai vahanmutan

తగ్గిపోతూ వచ్చాయి.

బ్రాహ్మణులనగా ఎవరు? బ్రహ్మ అనగా మంత్ర స్వరూపమని అర్థము. మంత్రస్వరూపమైన అర్థములను నిరంతరము స్మరిస్తూ రావటం వలన వారికి బ్రాహ్మణులనే పేరు వచ్చింది. ఈనాడు అట్టి బ్రాహ్మణులే ఈ మంత్రస్వరూపమైన దైవత్వమును విస్మరిస్తూ వచ్చారు. ఆధునిక విద్యలభివృద్ధి గావటంచేతను, ఆశలు పెరిగిపోవటంచేతను, ఆర్థిక ఆశలభివృద్ధి కావటంచేతను ఉత్తమ భావములు క్షీణించటం చేతను సంకుచితమైన భావములు పెరగటంచేతను తమ దివ్యత్వాన్ని తామే కోల్పోతూ వచ్చారు. కనుకనే యోగక్షేమములు కూడా క్షీణిస్తూ వచ్చాయి. ప్రపంచములో శాంతిభద్రతలు కోల్పోతూ వచ్చారు.

వేదములంటే ఏమిటి? వేదమనగా ఎఱుక అని ఒక అర్థము. తెలివి అని మరొక అర్థము. మూడవది వివేకము అని అర్థము. నిజముగా వారికి తెలివి తేటలు కావాలని, వివేకవంతులుగా అభివృద్ధి కావాలని ఆశ కలిగిన వారంతా వేదములను అభ్యసించాలి. ఈనాడు మేధాశక్తి పెరిగిపోతుంది గాని కృత్రిమమైన మేధాశక్తిగా పెంపొందించుకుంటున్నారు. ఏవిధంగా పదవులు పొందాలి. ఏవిధమైన మార్గములో ధనమును అభివృద్ధి గావించుకోవాలి. ఏవిధమైన మార్గంలో భోగభాగ్యాలను అనుభవించాలి. ఏమార్గములో శాంతి భద్రతలు పొందాలి అనే ఆశలు మాత్రమే తప్ప సద్గుణవంతులుగా, సదాచార సంపన్నులుగా మారాలి, దివ్యమైన మార్గంలో ప్రవేశించాలి, బ్రాహ్మ భావాన్ని పొందాలి అనే ఉన్నత భావాలే ఈనాడు సన్నగిల్లిపోతూ వచ్చాయి. కనుక వీరి తెలివితేటలన్నీ అల్పమైన మార్గములో స్వార్థ స్వప్రయోజనమైన మార్గములో ఉపయోగ పరచుకుంటూ వచ్చారు. ఈనాడు మానవత్వమనే దానిని మరచిపోతూ వచ్చారు. మానవ ఆకారమే నిలచినదిగాని మానవత్వమనేది మరుగున పడిపోయింది. మానవత్వము లేని మానవుని వల్ల లోకానికి కలిగే ఉపయోగమేమిటి? వేదమంతయు కూడను ఆకారమానవుని వల్ల ఉపయోగం లేదు, ఆచారప్రచార మానవులు కావాలి. విచార మానవులు కావాలని ఆశిస్తూ వచ్చింది.

**అంతరార్థములు గ్రహించండి**

ఈనాడు అనేకమంది వేదమంత్రములనధ్యయనం చేస్తున్నారు. వల్లె వేస్తున్నారు కాని



srisathyasaivechanamrutam

అర్థమును తెల్సి చేయటం చాలాకష్టంగా ఉంది. అర్థములు తెలిసి వేదాన్ని ఉచ్చరించటం చేత మరింత పరిపూర్ణ ఆనందాన్ని అనుభవించవచ్చును. తినుబండారముల పేర్లు మాత్రమే ఉచ్చరించినంత మాత్రమున దానియొక్క రుచులు గాని, ఆనందముగాని, దానియొక్క పుష్టిగాని, సంతుష్టిగాని మనకేర్పడవు. రసగుల్లా, మిఠాయి అని మనం ఉచ్చరిస్తాం. నేటి యీ పదార్థములపేర్లు మనం పుస్తకములో చదువుతాం. చదివినంత మాత్రమున, ఉచ్చరించినంత మాత్రమున దాని మాధుర్యము మనకేమాత్రము అనుభూతికి రాదు. దానిని భుజించినప్పుడు కలిగే మధురానందము మనకు ఈ పదములందుగాని, చింతలందుగాని లభ్యము కాదు. అట్లనే ఈ మంత్రములను ఉచ్చరించినంత మాత్రమున, వచించినంత మాత్రమున దాని పరిపూర్ణమైన దివ్యత్వము మనకర్థము కాదు. దాని అంతరార్థమును కూడను చక్కగా గుర్తించి వర్తించినప్పుడే దీనియొక్క పవిత్రమైన స్వరూపము మనకు సాక్షాత్కరిస్తుంది. వేదము విశాలమైన భావముతో వివేకమైన తలంపుతో, విజ్ఞానమయమైన భావముతో విశ్వవ్యాప్తియైనటువంటిదేగాని, సంకుచితంగా నిలచిపోయినది కాదు. ప్రతి విషయమునందును సమత్వాన్ని ప్రబోధిస్తూ వచ్చింది. ఏకత్వాన్ని అభివృద్ధి గావించుకుంటూ వచ్చింది. కష్ట సుఖములందును సమత్వాన్ని పంచుతూ వచ్చింది.

కాని ఈనాటి మానవుడు ఆ మంత్రములను ఉచ్చరిస్తూ కూడను అందులో ఇమిడి ఉన్న పవిత్ర సారాంశమును గుర్తించుకోలేకపోతున్నారు. ఒక్క మంత్రాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే చాలు. శాంతి మంత్రములో సహనావవతు సహనౌ భునక్తు అని ఈ మంత్రాన్ని నిత్యము పఠిస్తూ ఉంటారు. ఏమిటి ఈ మంత్రముయొక్క అర్థము?

**కలసి మెలసి తిరుగుదాం కలసి మెలసి మెలుగుదాం**
**కలసిమెలసి కలిమి చెలిమి బలము గుణము పెంచుదాం**
**కలసి మెలసి తెలుసుకున్న తెలివిని పోషించుదాం**
**కలసిమెలసి కలతలేక తెలివితొ జీవించుదాం**

అని దీనియొక్క అర్థము. ఎంతవిశాలమైన అర్థముతో కూడిన మంత్రము. ఇట్టి విశాలమైన మంత్రములన్నింటికి సంకుచితమైన అర్థములు కల్పించి తద్వారా వేదములనభివృద్ధి

sri sathyasai vachanamrutam

గావించుకుంటూ వచ్చారు. ఆనాడు ఉండిన సమత్వముగాని ఏకత్వముగాని ఈనాడు వెయ్యింట ఒక భాగము కూడా కన్పించటం లేదు. అట్టి పరిపూర్ణమైనది కనుకనే

**పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే**

అది పరిపూర్ణమైన తత్త్వము. ఇదియే వేదము యొక్క అర్థము. ఈనాటి మానవునియొక్క భావములు కేవలం మానవభావముల కంటె మరింత దిగజారిపోవటంచేత ఈ భిన్నత్వమభివృద్ధి అయిపోతూ వచ్చింది. అర్థం తెలియకుండా పోయినప్పుడు ఊరికే ఉంటే మేలు కానీ అనర్థాన్ని పెంచి దానిలో నానార్థములు అభివృద్ధిగావించుకున్నప్పుడు అనర్థాలు పెరుగుతూ పోయాయి గాని యదార్థములు నిలవకుండా వచ్చాయి.

ఈ యజ్ఞయాగాది క్రతువులందు ఋగ్వేదములో ఆ మంత్రములతో అనేక దేవతలనంతా వర్ణిస్తూ వచ్చారు. ఇందులో 33 దేవతలు ప్రధానముగా వర్ణిస్తూ వచ్చారు. ఇందులో సూర్యుడు ప్రధానము. ఈ దేవతలందరూ మానవులవలె అనేక అంగములతో కూడి ఉండేవారు. ఈ సూర్య తత్త్వమనేది జగద్వ్యాప్తి గావించినది. ఈ యజ్ఞములో సూర్యునికి ఋత్విక్కు అని ఒక పేరు. ఇతనికే హోత అని మరొకపేరు. ఇతనికే బ్రహ్మ అని మరొకపేరు. ఈ అర్పితముగావించినదంతా ఈ సూర్యుడు అనేకమంది దేవతలకందించటం అతని పని. అగ్ని దేవతా స్వరూపమనేది సూర్యప్రతిబింబమే. అగ్నికి కూడను రూప మున్నదని నిరూపిస్తూ వచ్చారు. అగ్నికి కూడను తల్లిదండ్రులుంటున్నారు. మీరు ప్రొద్దున్న చూశారు అరణి అని. క్రింద ఒక కట్టె పైన ఒక కట్టె పెట్టి దానిని దానిని చిలకటం. ఈ అగ్నిదేవుడు పుట్టిన తక్షణమే తల్లితండ్రులను భస్మంచేస్తాడు. క్రింద కట్టెనే తల్లి పైకట్టెనే తండ్రి. ఈ ఇరువురి నుండి అగ్నిదేవుడు ఉద్భవించాడు. ఈ అగ్నికి రూపము కూడా ఉంది. ఇతనియొక్క జ్వాలలన్నీ నాలుకల వంటివి. ఇతని యొక్క కిరణములన్ని శిరస్సుల వంటివి. కనుకనే సహస్రశీర్షాః పురుషః సహస్రాక్ష సహస్రపాత్ అని ఈవిధమైన మంత్రములతో దీనిని వర్ణిస్తూ వచ్చారు. ప్రతి ఒక్కరియందు ఈ అగ్ని తత్వము ఇమిడి ఉంటుంది. ప్రతి జీవి భగవంతుని స్వరూపమే అని దీని యదార్థము. ఈవిధమైన మంత్రములు ఉచ్చరించటం, భగవదర్పితం గావించటంచేత,

srisathyasaivachanamrutam

ఇవన్నీ భగవంతుని చేరి తద్వారా శాంతిని ప్రసాదించటం వలననే లోకకల్యాణం అభివృద్ధి అయింది.

ఎట్టిమంటనో అట్టి పొగ. ఎట్టి పొగనో అట్టి మేఘము. ఎట్టి మేఘమో అట్టి వర్షము. ఎట్టి వర్షమో అట్టి పంట. ఎట్టి పంటనో అట్టి వంట. ఎట్టి వంటనో అట్టిబుద్ధి. ఈనాడు మంత్ర స్వరూపమైన పొగలు లేకపోవటంచేత మన బుద్ధులన్నీ భ్రష్టమై పోతున్నాయి. ఈ మంటలతో భగవదర్పితము గావించిన పొగ మేఘములుగా మారిపోయి పవిత్రమైన మేఘములనుండి పవిత్రమైన జలబిందువులొచ్చి ఆ వర్షము చేత పవిత్రమైన పంటపెరిగి పవిత్ర పంటల వలన పవిత్ర పంటలు మనకొచ్చి పవిత్ర పంటల వల్ల పవిత్ర గుణము మనకు కలుగుతుంది. ఈనాటి మానవునకు ఈపాడు బుద్ధులు పీడబుద్ధులు అభివృద్ధి కావటానికి మూలకారణము ఇట్టి పవిత్రమైన యజ్ఞయాగాదులు క్షీణించటమే. ఏదో ఈ విధంగా నెయ్యినంతా ఇక్కడ అర్పితం చేసి అనేక ఖర్చులు పెట్టి ఈ విధమైన యజ్ఞము చేయటం వల్ల వచ్చే ఫలితమేమి? అని అనేకమంది అనేకవిధముల దూషిస్తారు. నిందిస్తారు విమర్శిస్తారు. దీనియొక్క విషయము తెలిసినవారికే అర్థమవుతుందిగాని తెలియనివారికి ఏ మాత్రం అర్థంకాదు.

ఒకరైతు ఒక వడ్లమూట నానబెట్టి మొలకలెత్తించి ఆ వడ్లను తీసుకుని పోయి బాగా బురదగా తాను దున్ని దుక్కిచేసిన ఆ బురదలో జల్లుతాడు. ఈ సేద్యము సంగతి తెలియని మూర్ఖుడు వ్యవసాయం సంగతి తెలియని మూర్ఖుడు అధిక విద్యావంతుడైన మూర్ఖుడు ఏమిటి తిండిలేక అల్లాడిపోతుంటే ఈ మొరటు మనిషి ఇన్ని వడ్లు ఈ బురదలో వేస్తున్నాడే అని వానిని దూషిస్తాడు. కాని ఈనాడు ఒక్కమూట వడ్లు ఆ బురదలో వేయటం వల్లనే మూడునెలల తరువాత తాను నూరు మూటలు వడ్లు ఇంటికి తెచ్చుకుంటున్నాడు. ఈనాడు ఒక్కమూట వల్లనే ఈ నూరు మూటలు వడ్లు వచ్చాయి. ఈ వడ్లే బురదలో వెయ్యకపోతే రేపటి దినము నూరుమూటలు ఇంటికి ఎలా చేరుతాయి అదే విధముగా ఈనాడు మంత్ర స్వరూపమైన రీతిగా వెయ్యాలి నెయ్యిని ఇంకా ద్రవ్యాలను, సుగంధద్రవ్యాలను విలువైన ద్రవ్యాలను. ఇట్లు అగ్నిలో మనం అర్పితం గావించటం చేతనే దానికి అనంతమైన ఫలితాలు మనకు లభిస్తుంటాయి. అర్పితము చేయటము మాత్రమే మీకు చూస్తున్నారు కాని అందుకునేది వారికి

sri sathyasaivachanamrutam

తెలియటంలేదు.

**త్యాగమును అలవరచుకొనండి**

మనము ఈనాడు ఒక త్యాగము క్రింద అనుభవించి నప్పుడే రేపటి దినము భోగము అనేదానిని అందుకొనుటకు అర్హులమవుతాము. పరిపూర్ణ హృదయముతో త్యాగము చేసినప్పుడే పరిపూర్ణ యోగమనే భోగము మనకు లభ్యమవుతుంది. దురదృష్టవశాత్తూ ఈనాడు ప్రతి మానవునికి కూడా ఈ త్యాగము అనేది కలలో కూడా రావటంలేదు. ఈ త్యాగము చేయటం కూడను ఒక ఫ్యాషనుగా రూపొందింది. త్యాగము అంటే ఏమిటో కూడను వారికి అర్థం కావటం లేదు. కనుకనే సర్వసంపత్తులు ఉండికూడను, సర్వసౌకర్యములు ఉండికూడను శాంతి భద్రతలు లేకుండా చింతలలో మునిగిపోతున్నాడు మానవుడు. తెలిసి త్యాగము చేయటం లేదు. ఇంటికి వచ్చిన బిచ్చగానికి పట్టెడన్నము పెట్టి వానిని సంతృప్తి పరచటం లేదు. కాని అనేకరకములుగా ధనమును దుర్వినియోగము గావిస్తున్నాడు.

**ముదుపులనుచు ధనము మూటగట్టి**
**బిచ్చగానికి మెతుకైన పెట్టకుండ**
**వేంకటేశుని హుండిలో వేయులోభి**

ఇంటికి వచ్చిన బిచ్చగానికి మెతుకైనా పెట్టడు. దేవునికని చెప్పి మూటకట్టి వేస్తాడు పాపంలోభి. వాడు పరమలోభి. సర్వులయందు ఉన్న భగవంతుని గుర్తించలేక సజీవ ప్రాణులను హింసించి నిర్జీవమైన దానిని పోషించటానికి ప్రయత్నిస్తున్నాడు మూర్ఖుడు. నిజముగా దేవునియొక్క శక్తి సామర్థ్యములు గుర్తించిన వానికి నీడబ్బు తనకెందుకు. కనుక నీడబ్బునంతా దేశమునకు సద్వినియోగం చేయాలి. దీనులకు దిక్కులేని వారికి తోడ్పడాలి. ఈ ధనమును దేవునకర్పితము చేయటములోకూడను కారణము లేకుండా పోలేదు. అక్కడ మాత్రం ఇతనికి ఒక కోరిక ఉంది. అల్పమునిచ్చి అధికముగా కోరటం.

ఓ దేవుడా! నాకు లాటరీలో పదిలక్షలు వస్తే నీకు పదివేలు ఇస్తాను అంటాడు. వీనికి పదిలక్షలు దేవుడివ్వటమేమిటి పదివేలు దేవుడు తీసుకోవటమేమిటి? నీకు పదిలక్షలిచ్చిన దేవునికి పదివేలు తన దగ్గరలేదా! ఈనాడిట్టి అల్పమైన కోరికలు, సంకుచితమైన భావములు



sri sathyasai vachanamrutam

పెరిగిపోతున్నాయి. కారణమేమిటి? వేద రహస్యమును గుర్తించుకోలేకపోవటమే దీనికి మూలకారణము. తుచ్ఛమైన సొత్తునిచ్చేది తుచ్ఛమైన కోరికలు కోరేది. ఇది భక్తియొక్క లక్షణాలు కావు. అవలక్షణాలు. ఇలాంటి భక్తులే ఇప్పుడధికమై పోతున్నారు. స్వామీ! నాకీ కార్యం నెరవేరితే నీకు మూడు టెంకాయలు కొడతాను. టెంకాయలు కొట్టకపోతే ఏమి? ఇందులో కూడా తిరిగి తనకే ఆదాయము. ఆ కొట్టిన టెంకాయలు తిరిగి తానే పచ్చడి చేసుకుంటాడు. ప్రతిప్రార్థన యందు, ప్రతి సాధనయందు స్వార్థము స్వప్రయోజనమే. కనుకనే వేదములో పరిపూర్ణ వేదసారమునేవిధంగా బోధించిందంటే నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః . అయ్యా నీవు చేసిన సత్కర్మల వలన కాదు. నీ సంపత్తివలనకాదు, త్యాగము వల్లనే నీకు అమృతత్త్వము ప్రాప్తిస్తుంది. ఆ అమృతత్త్వమనేది రావటం లేదు. ఈ త్యాగం మీరు చేయటం లేదు. ఒక బట్టల కొట్టుకు వెళ్లి ఐదు రూపాయలు వాడిముఖాన కొడితే ఒక హాండ్ కర్ఛీఫ్ మన ముఖానకొడ్తాడు. మనం ఇవ్వనిదే వాని వద్ద తీసుకొండుటకు వీలులేదు కదా! ఏదైనా ఒక వస్తువును మనం త్యాగము చేసినప్పుడే మరొక వస్తువును పొందే అధికారం మనకొస్తుంది.

**చావులేని చదువు చదువవలయు**

ఈనాడు త్యాగము మాత్రము లేదు. పొందే అధికారము మాత్రము కావాలి. మొట్టమొదట భగవంతునికి చేయవలసిన త్యాగం ఏమిటి? దుర్గుణములను త్యాగం చెయ్యాలి. సద్గుణములను పొందాలి. సంకుచితాన్ని త్యాగం చేయాలి. విశాలభావాన్ని పెంచుకోవాలి. అశాంతిని త్యాగం చెయ్యాలి. శాంతిని మనం పొందాలి. ఈ విధమైన త్యాగము చేయకుండా మనకు శాంతి లభించాలంటే ఏమాత్రం వీలుకాదు. కనుక ఈనాడు మనము నేర్చుకోవలసినది ఏమంటే త్యాగము, త్యాగము. నీధనమును ఇవ్వమనికాదు. లేక ధాన్యం పంచమనికాదు. ఇంకేవిధమైన ఆస్తిపాస్తులు పంచమనికాదు. ఎవరైనా దీనులను, దిక్కులేని వారిని చూచినప్పుడు హృదయం కరగాలి. కరిగినప్పుడు అదే త్యాగంగామారిపోతుంది.

కానీ ఈనాడు యిట్టి పవిత్రమైన వాతావరణము దూరము కావటం చేత హృదయాలు కరగటం లేదు. కఠినమై పోతున్నాయి. దుర్గుణములతో మరింత కఠినమైపోతుంది. మానవుని మనసు. ఈ విధంగా ఆర్జించిన ధనము ఏమిచేస్తాము? ముందు ముందు ఏమైపోతుంది?

srisathyasaivachanamrutam

ఎవరూ కూడ వెంట తీసుకుపోయేది ఏమీ లేదు. మన జీవితము ఉండినప్పుడే తోటి మానవులకు ఆనందాన్ని కల్గించే మార్గాన్ని మనం చేపట్టాలి. వేదముయొక్క సారమంతా ఇందులోనే ఇమిడి ఉంది. అన్నీ త్యాగము. త్యాగము. తనను తాను త్యాగం చేసుకునే మహాబుద్ధిని మనము పెంచుకోవాలి. ఎన్ని విన్నప్పటికి, ఎన్ని సాధించినప్పటికి మనబుద్ధులు ఉన్నచోటనే ఉంటున్నాయి.

**ఎన్ని విద్యలు నేర్చి ఏమి ఫలము**
**నొసట వ్రాతను తప్పింపనెవరి తరము**
**చెడ్డ బుద్ధులు తనతల చేరెనేని**
**బండ బారులు బుద్ధులు ఎండబారు**

కనుక మన చదువులలో లేవు ఇవంతా.

**చదువులన్ని చదివి చాల వివేకియై**
**మదిని తన్నెరుగడు మందమతుడు**
**ఎంత చదువు చదివి ఎన్నివిన్నను గాని**
**హీనుడవగుణంబు మానలేడు.**

**తరచి చదువు చదువ తర్కవాదమెగాని**
**పూర్ణజ్ఞానమెవడు పొందబోడు**
**చదివి చదివి చదివి చావంగనేటికి**
**చావులేని చదువు చదువవలయు**

త్యాగమే చావులేని చదువు. ఆ త్యాగములో ఎంతో ఆనందము మనకు లభ్యమవుతుంది. ఈ ఆనందములో మనము అమృతత్వాన్ని పొందుతాము. అమరత్వాన్ని పొందుతాము. ఆనందములో ఓలలాడుతాము. ఈ త్యాగమువలన ఎంత క్షేమము ఉందో యోచించుకోండి. కనుక మనం ఈనాడు నేర్చుకోవలసింది యజ్ఞం వలన ఫలితమేమంటే త్యాగమే. త్యాగమే బోధిస్తూ వచ్చింది వేదము. వేదములో ఒక్కొక్క మంత్రము కూడను ఒక్కొక్క దైవస్వరూపము.

sri sathyasai vachanamrutam

ఈనాడు మనమంతా వేదాన్ని ఉచ్చరిస్తున్నాము. దానియొక్క క్రియా రూపాన్ని మనం ఏమి అనుభవిస్తున్నాము. క్రియలో మనం అనుభవించని వేదం నిరుపయోగము.

**ఆకొన్న మానవుని ఆకలి తీరునా**
**పంచభక్ష్యంబుల పాకము విన**
**నిరుపేదవాని పేదరికంబు పోవునా**
**విత్త ప్రభావంబు విన్నయంత**
**రోగపీడితుని రోగంబు పోవునా**
**మందుల మహిమనువిన్నయంత**

ఆ మందులు త్రాగాలి. అప్పుడే మన ఈరోగము నివారణవుతుంది. అన్నము తినాలి. ఆకలి తీరుతుంది. ఈ విధముగా ఆచరణలో పెట్టినప్పుడే ఆ ఆనందం మనకు ప్రాప్తిస్తుంది. ఆనంద ప్రాప్తినిమిత్తమై మనం నేర్చుకుని, యోగతత్త్వాన్ని అర్థంగావించుకొని దివ్యత్వంలో మనం జీవించటానికి ప్రయత్నించాలి. ఇదియే వేదముయొక్క ప్రధాన అంతరార్థము.

**తెలిసి రామ చింతన చేయండి**

ఈ వేదములు ప్రాపంచిక యోగక్షేమములు ఏవిధంగా తెలుపుతూ వచ్చాయి. వేదములలో ఏమి మనం చేయగలిగినవి, ఏవి నిషిద్ధమైనవి అనే అంతరార్థము మనము విచారించాలి. లోకక్షేమము ఏవిధమైన మార్గంలో ఏర్పడుతుంది. ఈ అన్నింటికి మూలకారణమేమిటి? మానవుని ప్రవర్తన అనే సత్యాన్ని నిత్యజీవితములో అందించే సూత్రాలు రేపటినుండి మనం చూసుకుందాము. వేదాంత పరిభాషయందు ఉన్న మహా పదముల యొక్క అంతరార్థమును విద్యార్థులు కొంచెం గుర్తించాలి. ఈనాడు కేవలము పదములు మాత్రమే ఉచ్చరిస్తున్నారు. కాని దానియొక్క అంతరార్థమును గుర్తించేవారు లేరు. దీనికి ఈనాటి విద్యార్థులకు తగినట్లుగా బోధించేవారు కూడాలేరు. బోధించేవారు ఉండినప్పటికిని దానిని ఆచరించేవారు మరింత అరుదైపోతున్నారు. కనుక వేదాంతములో ఉన్న పవిత్ర పదముల అంతరార్థమును చక్కగా తెలుసుకొనుటకు శ్రద్ధాభక్తులు మీరు పెంచుకోవాలి. ఏది చేసినప్పటికి తెలుసుకొని మనం చెయ్యాలి. 2 గంటలప్పుడు త్యాగరాజు చరిత్రను చెప్పారు హరికథా కాలక్షేపంలో. త్యాగరాజు

sri sathyasai vachanamrutam

కూడా తెలిసి రామ చింతన చేయవే మనసా అన్నాడు. నువ్వు తెలియకుండా చెయవద్దు. ఏదో కనులు మూసుకొని రాం రాం రాం అంటే టేపురికార్డరు కూడా పాడుతుంది. గ్రామఫోను ప్లేటు కూడా పాడుతుంది. ప్రయోజనమేమిటి? తెలిసిదానిని అనుభవించి రామ చింతన చేయాలి. రామరామ అంటే ఏమిటి దీని అంతరార్థం. ర అనగా ఆత్మ మ అనగా జీవుడు. జీవుడు ఆత్మ రెండూ ఏకం కావడమే రామఅనేటువంటి భావం. జీవాత్మ పరమాత్మలయొక్క సమ్మేళన స్వరూపమే దివ్యత్వమైన నామస్మరణ.

వేదములన్నియు కేవలం ప్రవృత్తి మార్గమునే బోధిస్తూ వచ్చాయి. ఇక్కడ ఉన్న రసాయన శాస్త్రము, వృక్షశాస్త్రము, పదార్థ శాస్త్రము, ఆర్థిక శాస్త్రము, సంగీత శాస్త్రము ఇవన్నీ వేదములనుండి వచ్చినవే. ఇవన్నీ ప్రవృత్తిని మాత్రమే బోధిస్తున్నాయి. కనుకనే వేదములను ద్వైతము అని చెప్పుతూ వచ్చారు. ఒక్క ఉపనిషత్తులు మాత్రమే నివృత్తి మార్గాన్ని కూడా బోధిస్తూ వచ్చాయి. అనగా మానవుని చతుర్విధ పురుషార్థములందు ధర్మార్థకామ మోక్షములు ఈ మూడింటిని మాత్రం వేదము బోధిస్తూ వచ్చింది. ఉపనిషత్తులు కేవలం విద్యవల్లనే గుర్తించటానికి వీలవుతుందని నిర్ణయించాయి. ఈ విద్యలందుకూడా రెండు రకములైన విద్యలున్నాయి. పరవిద్య, అపర విద్య, ఈనాడు లోకములో మనం నేర్చుకునే విద్యలన్నీ కూడను అపరవిద్యలే. ఒక్క మోక్షము మాత్రమే పరవిద్య. అపరవిద్య నిమిత్తమై మనం ప్రాకులాడాలి. అది మాత్రమే వేదాంతమన్నారు.

వేదములలో అంత్యము ఉపనిషత్తు. ఈ అన్ని వేదముల సారమంతా ఉపనిషత్తులలో ఇమిడి ఉంది. ఈ వేదములలో అంత్యమైనది ఉపనిషత్తు కాబట్టి దీనికి వేదాంతమని పేరు వచ్చింది. వేదములంతా ద్వైతము. వేదాంతము అద్వైతము. అద్వైతమే ఆనందము సరైన స్థానము. వేదములంతాకూడను నేను అనే అహంతత్వాన్ని బోధిస్తూ వచ్చాయి. నేను అనేదాని అంత్యమునే వేదాంతముగా బోధిస్తూ వచ్చింది ఉపనిషత్తు. నేను నేను అనేదాని అంత్య వేదాంతము. నేను అంత్యము కావాలి. ఈ నేను అనేది ఉండినంతవరకు అది ప్రాకృతమైనదే. ఇది పరవిద్యకేమాత్రం సమీపంకాదు. అపరవిద్యలతో కూడినటువంటిది. ఉపనిషత్తులకు వేదములకు ఉండే వ్యత్యాసాన్ని మనము గుర్తించాలి. సర్వవేదసారము వేదాంతముయొక్క

sri sathyasaivachanamrutam

తత్త్వములో ఇముడ్చుకొని ఆచరణ రూపమైన ప్రచారములు మనం ఆచరించినప్పుడే ఈ అద్వైతతత్త్వము మనకర్థమవుతుంది.

దివ్యాత్మ స్వరూపులారా! వేదముయొక్క స్వరూపాన్ని మాత్రమే మనమీనాడు చర్చించుకున్నాము. వేదముయొక్క ఫలితము విశిష్టత, వ్యాప్తి మనమే విధముగా గావించాలి. నిత్యజీవితములో మనవేవిధంగా అనుభవించాలి. అనే విషయాన్ని మున్ముందు తెలుసుకుందాము. మానవుడు పుట్టినది మొదలు గిట్టునంత వరకు వేదములోనే జీవిస్తున్నాము. అది వానికి తెలియటము లేదు. వేదమే మన జీవితమును నియమిస్తూ వచ్చింది. ఏవిధముగా మన నిత్యజీవితములోపల వేదము ఇమిడి ఉంది. రేపటి దినము తెలుసుకుందాం. అన్నింటియందు భగవన్నామ స్మరణే ఇమిడి ఉంటున్నది. అదే భగవంతుని స్మరణ. అదే భగవంతుని స్వరూపము. అదే భగవంతుని చింతన. దేవతా స్వరూపమైన శృతిని మనము ఆనందముగా చేసినప్పుడే ఆ దైవత్వము మనలో ఆవిర్భవిస్తుంది.

**(తేది. 03-10-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam